ప్రతి గడపకు సంక్షేమం


వృద్ధురాలికి బుక్‌లెట్ అందిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర
- శంబరలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం

మక్కువ: ప్రతిగడపకు సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రవేశపెట్టారని డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర అన్నారు. ఈ మేరకు మక్కువ మండలంలోని శంబర గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఆయన నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఉపముఖ్యమంత్రి రాజన్నదొర గ్రామంలోని పణుకు వీధి, ప్రధాన వీధి, హరిజన వీధిలో పర్యటించారు. ప్రతి గడపకు వెళ్లి, ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అర్హులకు అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. అర్హులైనప్పటికీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి వారికి పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర, ఈ గ్రామంలోని పాఠశాలలో చదువుకోవడం వల్ల, పూర్వ విద్యార్థులు ఆయనను కలిసి, ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు.

రాజన్నదొరకు ఘనంగా స్వాగతం

శంబర గ్రామానికి చేరుకున్న డిప్యూటీ సీఎం రాజన్నదొరకు, గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికి గ్రామ సచివాలయం నుంచి ప్రధాన రహదారి వరకు ర్యాలీగా కదిలారు. జై జగన్, జై రాజన్న అంటూ నినాదాలు చేశారు. గ్రామంలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని పరిష్కరించే మార్గం చూడాలని పణుకువీధి, హరిజనవీధి ప్రజలు కోరారు. దీనికి సందించిన రాజన్నదొర వెంటనే ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జోగారావును పిలిచి, తాగునీటి సమస్య పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

కార్యక్రమంలో సర్పంచ్ సింహాచలమమ్మ, జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు, ఉప సర్పంచ్ అల్లు వెంకటరమణ, శంబర పోలమాంబ అమ్మవారి ట్రస్ట్ బోర్డు చైర్మన్ పూడి దాలినాయుడు, నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర డైరెక్టర్ సీహెచ్ రామారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు దండి శ్రీనివాసరావు, చప్ప సూర్యనారాయణ, కొత్తూరు శంకరరావు, కోట్ల నారాయణరావు, ఎంపీడీవో సూర్యనారాయణ, తహసీల్దార్ సూర్యనారాయణ, ఎంఈఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


శంబర గ్రామానికి చేరుకున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర వెంట ర్యాలీలో పాల్గొన్న గ్రామస్తులు

క్లుప్తంగా

నూతన రామాలయం నిర్మాణానికి రూ. 10లక్షలు


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: బలిజిపేట మండలం బర్లి గ్రామంలో నూతన రామాలయం నిర్మాణానికి శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రూ. 10లక్షల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన తన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద గ్రామపెద్దలకు తొలివిడతగా రూ. 4.30లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఉన్న శ్రీవాణి ట్రస్ట్ ఆలయాల పునరుద్ధరణకు ఎంతో కృషి చేస్తోందని, తాము అడిగిన వెంటనే స్పందించి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు గ్రామపెద్దలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పాలూరి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

- ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

పార్వతీపురంటౌన్: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సీఎం జగన్‌మోహన్ రెడ్డి అందజేస్తున్నారని ఏపీ టిడ్కోచైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన పట్టణంలోని 29,30 వార్డుల్లో ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, సేవలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించామన్నారు. పేదలకు సొంతింటి కల అయిన టిడ్కో ఇళ్లను కట్టించి ఇస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనోత్సవంలో తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్


గలావల్లిలో గణేష్ నిమజ్జనోత్సవం

బలిజిపేట: మండలంలోని గలావల్లి ఎగువ వీధిలో గురువారం రాత్రి నిర్వహించిన గణేష్ నిమజ్జనోత్సవంలో తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ ఎం.శ్రీకాంత్ పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి కరుణా కటాక్షాలు అందరికి ఉండాలని, ఆయన ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. కోలాటాలు, భజనలు, ప్రజల గణేష్ నామస్మరణల మధ్య స్వామివారి నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు దాలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బూర్జలో వైద్యసిబ్బంది సర్వే


ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

సీతానగరం: మండలంలోని బూర్జలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేయడంతో పాటు పంచాయతీలో ఉన్న బూర్జ, ఆవాలవలస గ్రామాల్లో 950 కుటుంబాల ఇళ్లకు వెళ్లి ఆరోగ్య పరమైన సర్వే చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ రాధాకాంత్, ఎంఎల్‌హెచ్‌పీ గాయత్రి తెలియజేశారు. ఈ మేరకు గురువారం వారు మాట్లాడుతూ గ్రామంలో సర్వే పూర్తి కావడంతో వివిధ రకాల ఆరోగ్య పరమైన సమస్యలతో ఉన్న 400 మందికి కూపన్లు పంపిణీ చేశామని, వారందరికీ ఈ నెల 30వ తేదీన బూర్జ ఉన్నత పాఠశాలలో నలుగురు డాక్టర్ల బృందంతో వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సేవలు అందించనున్నామని తెలిపారు.

విద్యుత్ బిల్లుతో ఆధార్ అనుసంధానం

వీరఘట్టం: విద్యుత్ వినియోగదారులు అందరూ తమ కరెంటు బిల్లుకు ఆధార్‌కార్డు నంబర్‌ను అనుసంధానం చేసుకోవాలని వీరఘట్టం ట్రాన్స్‌కో ఏఈ డి.బాలాజీ గురువారం తెలిపారు. మీ ఇంటికి లైన్‌మెన్ వచ్చేటప్పుడు కరెంటు బిల్లుతో పాటు ఆధార్ కార్డు జెరాక్స్ కాపీని ఇవ్వాలని కోరారు.

15,919ఎకరాలలో ఈ క్రాప్ నమోదు


బర్లిలో బయోమెట్రిక్ నమోదును పరిశీలిస్తున్న ఏఓ శ్రావణ్

బలిజిపేట: మండలంలోని 18,500 ఎకరాలకు గాను ఇప్పటికి 15,919ఎకరాలలో ఈ క్రాప్ నమోదైందని ఏఓ శ్రావణ్ తెలిపారు. ఈ మేరకు బర్లిలో గ్రామంలో ఈ క్రాప్ నమోదును ఆయన గురువారం పరిశీలించారు. మొత్తం ఈ క్రాప్ నమోదు ఈనెలాఖరుకు పూర్తిచేయనున్నట్లు చెప్పారు. రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్ చేయించుకోవాలని కోరారు. రైతులు సాగుచేస్తున్న పంట వివరాలను ఆర్బీకే వద్ద వీఏఏలకు తెలియచేసి, ఆవివరాలతో నేరుగా పంట వద్దకు వెళ్లి జియో కోఆర్డినేట్స్ ఆధారంగా పంట వివరాలను ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు. ఏ రెవెన్యూ గ్రామ పరిధిలో భూమి ఉంటుందో వీఏఏలకు తెలియచేయాలని చెప్పారు. ఈ క్రాప్ ఆధారంగా పంట విక్రయించే వీలుంటుందన్నారు. ఇన్సూరెన్స్, సున్నావడ్డీ రాయితీ, ప్రభుత్వ పథకాలు ఈ క్రాప్ నమోదు చేయించిన రైతులకు అమలవుతాయని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతులందరూ ఈకేవైసీ చేసుకోవాలి

- జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి డాక్టర్ రాబర్ట్‌పాల్

సీతానగరం: జిల్లాలోని రైతులు తమపంట పొలాల్లో సాగు చేసి పండించిన పంటలపై ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకుని ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాల లబ్ధిపొందాలని జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్ అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని కె.సీతారాంపురం, అంటిపేట గ్రామాలలో గురువారం ఏఓ ఎస్.అవినాష్‌తో కలిసి వ్యవసాయ సహాయకులు చేస్తున్న ఈ పంట నమోదు, ఈకేవైసీ పనులను దగ్గరుండి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పంట నమోదు ఖరీఫ్ 2023కు సంబంధించి ఈనెల 30 చివరి తేదీ కనుక రైతులందరూ గమనించి ఈ పంట నమోదు, ఈ కేవైసీ త్వరితగతిన చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇప్పటి వరకు జిల్లాలో 66% ఈకేవైసీ జరిగిందని, ఈ పంట నమోదు 85% జరిగిందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. రాబోయే మూడు రోజుల్లో 100% ఈకేవైసీ, ఈ పంట నమోదు పూర్తి చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో రైతులు, సర్పంచ్‌లు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌కు ఎమ్మెల్యే పరామర్శ


పీఏసీఎస్ చైర్మన్ శివున్నాయుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: మండలంలోని వెంకంపేట గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు, పీఏసీఎస్ చైర్మన్ తీళ్ల శివున్నాయుడు ఇటీవలే ప్రమాదానికి గురై శస్త్రచికిత్స చేయించుకున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు గురువారం ఆయన గృహానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డాక్టర్ల సూచనలు పాటిస్తూ విశ్రాంతి తీసుకుని మళ్లీ పూర్వస్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. పూర్వస్థితికి వచ్చిన తరువాత ప్రజా క్షేత్రంలో తిరిగి సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మిరమేష్, పార్టీ నాయకులు సిద్ధా జగన్నాథరావు, బంకురు రవికుమార్, బలగ నాగేశ్వరరావు, మజ్జి శేఖర్, తీళ్ల చంటి, కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అన్నసంతర్పణలో పాల్గొన్న ఎమ్మెల్యే

పార్వతీపురం మండలం వెంకంపేట గ్రామంలో వరసిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన అన్నసంతర్పణ కార్యక్రమంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదానం నిర్వహించడం గొప్ప విషయమని, ఇటువంటి కార్యక్రమంలో భాగస్వామ్యమైనందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. అన్నదాన కార్యక్రమానికి తన వంతుగా రూ. 10వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామపెద్దలు, ప్రజలు, యువత తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల ర్యాలీ

కురుపాం: మండల కేంద్రంలో మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ముస్లిం సోదరులు జామియా మసీద్ కమిటీ మత గురువు షేక్ సర్దార్ మాలీం ఆధ్వర్యంలో శివ్వన్నపేట నుండి కురుపాం మండల కేంద్రంలోని పలు వీధుల్లో గురువారం ర్యాలీ నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త బోధనలను, సూక్తులను ప్రజలకు తెలియజేసారు. ర్యాలీలో కురుపాంకు చెందిన ముస్లిం మత పెద్దలు, యువత పాల్గొన్నారు.


కురుపాం: మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

గ్రామాల అభివృద్ధికి కట్టుబడిన ప్రభుత్వం

సీతానగరం: గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు మండలంలోని పెద భోగిలి గ్రామంలో ఎస్సీ, బీసీ కాలనీల్లో నిర్మిస్తున్న అభివృద్ధి పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధికి నోచుకోక ప్రజలు రాకపోకలకు పడుతున్న ఇబ్బందులను గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తాను నేరుగా చూసి ప్రజల కనీస అవసరాలు తీర్చడంతో పాటు సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ మంజూరు చేస్తామని అప్పట్లో హామీఇచ్చానన్నారు. ఈ మేరకు పెదభోగిలి ఎంపీటీసీ సెగ్మెంట్-1 పరిధిలో ఎస్సీ, బీసీ కాలనీల్లో గత కొన్ని దశాబ్దాల కాలంగా అభివృద్ధికి నోచుకోని వీధుల్లో కాలువల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బి.శ్రీరాములునాయుడు, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, ఎంపీటీసీ ఎస్. గౌరి , పార్టీ మండల నాయకులు పార్థసారథి, కిరణ్‌కుమార్, యు.సరేష్, రమేష్, ఇజ్జాడ సింహాచలం, పీఏసీఎస్ చైర్మన్ ఎస్.కూర్మారావు, వినోద్‌కుమార్, కురమాన శ్రీనివాసరావు, బి.ముకుందరావు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమన్వయంతో పార్టీని బలోపేతం చేద్దాం


మాజీ ఎమ్మెల్యే జయమణితో చర్చిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని 2024లో రెండవ పర్యాయం సీఎంను చేయడమే లక్ష్యంగా అందరం సమన్వయంతో పనిచేద్దామని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఈ మేరకు గురువారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్సీక మిషన్ సభ్యురాలు సవరపు జయమణిని పెద భోగిలిలోగల ఆమె స్వగృహంలో కలిసి పార్టీ అభివృద్ధికి తీసుకోవలసిన అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు పి.ఈశ్వరనారాయణ, బి. శ్రీరాములునాయుడు, ఆర్వీ పార్థసారథి, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, రామారావు మాస్టారు పాల్గొన్నారు.

నేడు పాలకొండలో 'జగనన్నకు చెబుదాం'

పార్వతీపురం: మండల స్థాయిలో కలెక్టర్ నేతృత్వంలో నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని శుక్రవారం పాలకొండలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాలకొండ సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుండి జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమ అర్జీలను తెలుపుకోవచ్చునన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం అక్టోబర్ 4న జియ్యమ్మవలస, 16న వీరఘట్టం, 11న కురుపాం, 13న సీతంపేట, 18న సాలూరు, 20న పాచిపెంట, 25న భామిని, 27న గుమ్మలక్ష్మీపురం గ్రామంలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాలకొండ రూరల్: మండలంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్టు ట్రాన్స్‌కో ఏఈ ఎస్.శ్యామ్‌సుందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరఘట్టం ఫీడర్ పరిధిలో 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల నిమిత్తం ఈ అంతరాయం ఏర్పడనున్నట్టు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తంపటాపల్లి, తుమరాడ, కోటిపల్లి, బుక్కూరు, గోపాలపురం, మంగళాపురం, బాసూరు, కోటిపల్లి తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా లో అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అగ్ని అస్త్రం తయారీపై అవగాహన


బలిజిపేటలో తయారుచేస్తున్న ద్రావణం

బలిజిపేట: వరిపంటలో పురుగుల నివారణకు స్థానిక సర్పంచ్ రాఘలత ఆధ్వర్యంలో ఏఓ శ్రావణ్‌కుమార్ గురువారం అగ్నిఅస్త్రం తయారు చేశారు. ఈ మేరకు తయారుచేసే విధానంపై రైతులకు ఆయన అవగాహన కల్పించారు. ఈ ద్రావణం వినియోగం పచ్చపురుగు, కత్తెరపురుగు తదితర పెద్ద పురుగుల నివారణకు ఉపయోగ పడుతుందని ఎంసీఆర్‌పీ లక్ష్మి వివరించారు. దీని తయారీకి గోమూత్రం, పచ్చిమిరపకాయలు, వెల్లుల్లి, పొగాకు గుండ, వేపాకులు, జిల్లేడు ఆకులు అవసరమని చెప్పారు. ముందుగా గోమూత్రం మరగపెట్టి తరువాత పచ్చిమిర్చి, వెల్లుల్లి, పొగాకుగుండ, వేపాకులు ముద్దలా నూరి దానిలో వేసి రెండు నుంచి మూడు పొంగులు వచ్చేవరకు మరిగించాలి. తరువాత దానిని 48గంటలు నిల్వ ఉంచగా తయారైన కషాయాన్ని ఎకరాకు 8నుంచి 10లీటర్లు స్ప్రే చేయాలి. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కషాయాల వాడకం వల్ల రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గి నాణ్యమైన దిగుబడులు వస్తాయని తెలిపారు.

లక్ష్మీనృసింహ స్వామికి ముడుపుల పూజలు


ప్రత్యేక అలకంరణలో లక్ష్మీనృసింహస్వామి

సీతానగరం: మండల కేంద్రంలో సువర్ణముఖి నది ఒడ్డున వేణు గోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసిన లక్ష్మీనృసింహ స్వామివారికి గురువారం భక్తులు ముడుపుల పూజలు, అభిషేకాలు ప్రధాన అర్చకుడు పీసపాటి శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో జరిగాయి. లక్ష్మీనృసింహ స్వామి వారికి ప్రీతికరమైన రోజు గురువారం కావడంతో దూర ప్రాంతాలనుంచి భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చి క్యూ కట్టారు. ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు పీసపాటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు వివిధ రకాలపూలు, పత్రాలతో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఉదయం 6 గంటల నుంచి ఆలయానికి చేరుకున్న భక్తులతో ప్రత్యేక పూజలు చేయించారు. దూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులకు ప్రసాదాల వితరణ చేశారు.

నాణ్యతా ప్రమాణాలతో ఇంటింటి కుళాయి పనులు


పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

సీతానగరం: జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా చేపడుతున్న ఇంటింటి కుళాయి, వాటర్ ట్యాంక్ పనులు నాణ్యతా ప్రమాణాలకు లోబడి నిర్వాహకులు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్ పవన్‌కుమార్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన సీతానగరం మండలంలోని లచ్చయ్యపేటలో జరుగుతున్న మంచినీటి పథకం పనులను జెడ్పీటీసీ ఎం బాబ్జీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు బి.శ్రీరాములు నాయుడు, ఎంపీటీసీ అక్కపోలు సింహాచలం,సర్పంచ్ సీహెచ్ కృష్ణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్ పథకం నిధులు రూ.8.81 లక్షలను మండలంలోని 39 గ్రామాల్లో ఇంటింటి కుళాయిల నిర్మాణానికి మంజూరుచేసినట్లు తెలియజేశారు. ఇంతవరకూ 23 గ్రామాల్లో పనులు పూర్తయ్యాయని,16 గ్రామాల్లో పనులు వివిధ స్థాయిల్లో ఉన్నాయన్నారు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు ఇంటింటి కుళాయిల ద్వారా తాగు నీరు సరఫరా చేస్తామని చెప్పారు.

రేబిస్ వ్యాధిపట్ల అవగాహన అవసరం


వ్యాక్సినేషన్ డ్రైవ్‌లో పాల్గొన్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథరావు

పార్వతీపురంటౌన్: రేబిస్ వ్యాధిపట్ల అవగాహన అవసరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. ప్రపంచ రేబిస్ డే సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.వాగ్దేవి ఆధ్వర్యంలో జిల్లా ఆస్పత్రిలో గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. కార్మికులకు, కుక్కలను పట్టే వారికి కుక్కకాటుతో వచ్చిన రోగులకు ఏఆర్‌వీ ఇంజక్షన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి మాట్లాడుతూ ప్రజలకు కుక్కకాటువల్ల వచ్చే రేబిస్ వ్యాధి గురించి అవగాహన ఉండాలని కుక్కకాటు వేసిన వెంటనే దగ్గరలో ఉన్న ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అవసరమైన వైద్యం చేయించుకోవాలని సూచించారు. జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.వాగ్దేవి మాట్లాడుతూ కుక్కకాటుకు ఎటువంటి నాటు వైద్యం తీసుకోరాదని, వైద్యం తీసుకోవడంలో అలసత్వం కూడదని ప్రాణాంతకమని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సర్వేలైన్స్ అధికారి డాక్టర్ నవీన్‌కుమార్, ఏపీఎన్‌జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు జీవీఆర్‌ఎస్ కిశోర్, యానిమల్ బైట్ క్లినిక్ సభ్యులు పాల్గొన్నారు.

పశువ్యాధులపై అవగాహన అవసరం


రైతులకు మందులు అందజేస్తున్న పశు వైద్యాధికారి

గుమ్మలక్ష్మీపురం: వర్షాకాలంలో పశువులకు వచ్చే వ్యాధుల పట్ల పాడి రైతులు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని గొరడ పశువైద్యాధికారి పి. లక్ష్మణరావు అన్నారు. మండలంలోని వంజరాపు గూడ గ్రామంలో గురువారం ఆయన వైఎస్సార్ పశు విజ్ఞాన బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స, ఆడ పెయ్యలకు బ్రుసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. వర్షాకాలంలో వచ్చే జబ్బవాపు, గొంతు వాపు, ముద్దచర్మ వ్యాధులకు అలాగే గొర్రెలు, మేకలకు వచ్చే చిటుకు వ్యాధి, మూతిపుండ్లు, ముసరా వ్యాధులకు కూడా టీకాలు వేశారు. పశు వ్యాధి సంబంధిత మందులను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సహాయకులు కె.మణికంఠేశ్వరి, ఎస్.శరత్, ఆరిక పవన్, సీమల గణేష్ ఉన్నారు.